ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
శుక్రవారం 6 సెప్టెంబరు 2024



కడగండ్లు 7లో
వరుణుడి ఉగ్రరూపంతో అన్నదాతకు తీరని నష్టం
కుంటలో ఇళ్లు.. కొన్నవాళ్లకు కష్టాలు! 6

చేపల ఫ్రై అదుర్స్..

పుల్కల్ మండలం సింగూరు ప్రాజెక్టు సందర్శనకు వచ్చేవారికి చేపల కూర నోరూరిస్తుంది. డ్యాం గేట్లు ఎత్తడంతో సందర్శకుల రాక పెరిగింది. వారికి ప్రాజెక్టు వద్ద చేపల కూర స్టాల్స్ నోరూరిస్తున్నాయి. ప్రకృతి అందాలు, నీటి అలలను ఆస్వాదిస్తూ వేడివేడి చేపల ఫ్రై రుచి చూసేందుకు ఎగబడుతున్నారు. -పుల్కల్





సింగూరు ప్రాజెక్టు



'మహబూబ్‌సాగర్' సందర్శించిన జగ్గారెడ్డి

చెరువు మోకాళ్ల నీళ్ల లోతుల్లోకి దిగి అలుగు పరిశీలన గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించేలా సూచనలు



సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువులో పేరుకున్న గుర్రపు డెక్కను తొలగిస్తున్న యంత్రం పైకెక్కి పరిశీలిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



మహబూబ్‌సాగర్ చెరువు అలుగు వద్ద నీటిలోకి దిగి పరిశీలిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబరు 5: సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మహబూబ్‌సాగర్ చెరువును గురువారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సందర్శించారు. మోకాళ్ల లోతు నీటిలోకి దిగి కలియదిరిగారు. పారుతున్న అలుగును పరిశీలించారు. చెరువులో పేరుకు పోయిన గుర్రపుడెక్కను తొలగిస్తున్న యంత్రం పైకెక్కి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌సాగర్ చెరువు అలుగు పారడం హర్షణీయమన్నారు. చెరువును పరిశుభ్రంగా ఉంచడానికి ఐదు నెలల నుంచి ప్రత్యేక యంత్రంతో గుర్రపుడెక్కను తొలగిస్తున్నట్లు చెప్పారు. కొద్దిరోజుల్లోనే పూర్తిస్థాయిలో గుర్రపు డెక్కను తొలగించి చేపల పెంపకానికి అనుకూలంగా మారుస్తామని అన్నారు. చెరువు పరిసరాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

వరదొస్తే రస్తా బంద్

- వర్షాలకు మునుగుతున్న రోడ్లు
- విన్నపాలపై స్పందించని అధికారులు
- హామీలు మరిచిన ప్రజాప్రతినిధులు
- మరమ్మతుల పేరిట నిధుల దుర్వినియోగం
- శాశ్వత నిర్మాణాలు చేపడితేనే ప్రయోజనం
- మెదక్ జిల్లాలో 8, సంగారెడ్డి జిల్లాలో 29 రోడ్లు ధ్వంసం
- 106 కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రహదారులు



వాగు కాదిది.. సంగారెడ్డి మండలం ఇరిగిపల్లికి వెళ్లే రోడ్డు!



తూప్రాన్ మండలం యావాపూర్-కిష్టాపూర్ మార్గంలో కాజ్ పైనుంచి వాగు పారుతుండడంతో నిలిచిన రాకపోకలు



టేక్మాల్ మండలంలో 10 గ్రామాలకు వెళ్లే రోడ్డు మీదుగా గుండు వాగు ప్రవాహం



కంది మండలం ఎర్దనూరు నుంచి తండాకు వెళ్లే దారి వద్ద పోలీసు పహారా

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, సెప్టెంబరు 5: వర్షం కురిసిందంటే సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. రోడ్లు కాల్వలను తలపిస్తున్నాయి. కాజ్‌వేలు, లో లెవల్ వంతెనల పైనుంచి వరద ప్రవహిస్తున్నది. వంతెనలు నిర్మించాలని, కల్వర్టుల ఎత్తు పెంచాలనే ప్రజల విన్నపాలు విన్న వారే లేరు. నాయకుల ఎన్నికల హామీలు నీటిమూటలుగానే మారాయి. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు ఈ పరిస్థితులు మరోసారి పునరావృతమయ్యాయి. వర్షం కురిసినా, వాగులు పొంగినా, వరద తన్నుకొచ్చినా రాకపోకలు నిలిచిపోయే గ్రామాలు రెండు జిల్లాల్లో పదుల సంఖ్యలోనే ఉండడం గమనార్హం. మొన్నటి వర్షాలకు మెదక్ జిల్లాలో 8 రహదారులు, సంగారెడ్డి జిల్లాలో 29 చోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. 106 కి.మీల రహదారులు ధ్వంసమైనట్లు గుర్తించారు. వర్షాలు కురుస్తున్నాయంటే పలు రహదారుల వద్ద పోలీసులే కాపలాగా ఉంటున్నారంటే అతిశయోక్తికాదు.

మరమ్మతులతోనే సరి

ప్రతీ సంవత్సరం వర్షాలకు రహదారులు కోతకు గురికావడం, గుంతలుగా మారడం, కంకర తేలిపోవడం సర్వసాధారణమైంది. వీటి మరమ్మతుల పేరిట తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు. నిధుల దుర్వినియోగమే తప్ప ఎలాంటి ప్రయోజనాలు కలగడంలేదనే విమర్శలు ఉన్నాయి. కొన్నిచోట్ల వంతెనలు, రహదారుల పనులు అసంపూర్తిగా మారాయి. కల్వర్టుల స్థానాల్లో కొత్త వంతెనలు నిర్మిస్తే రాకపోకలకు అనువుగా ఉంటుందని ఆయా గ్రామాల్లో మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వర్షాకాలం సీజన్ ముగిసిన వెంటనే సంబంధిత వంతెనలు, రహదారులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు చేపట్టాలనే డిమాండ్ నెలకొంది.



మునిపల్లి మండలం బోడపల్లి, పిల్లోడి గ్రామాల మధ్య పిల్లర్ల దశలోనే నిలిచిన వంతెన నిర్మాణ పనులు

1,400 విద్యాసంస్థలకు ఫ్రీ కరెంట్

స్కూళ్లు, కాలేజీలకు తప్పనున్న బిల్లుల భారం



సంగారెడ్డిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 5 : సర్కారు విద్యా సంస్థలకు విద్యుత్ బిల్లులు గుదిబండలా మారుతున్నాయి. నిర్వహణకు వచ్చే నిధుల్లో సగానికి పైగా కరెంటు బిల్లులకే పోతున్నాయి. దీంతో, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీల ప్రధానోపాధ్యాయులు ఇక్కట్లు పడుతున్నారు. ఈ ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం అన్నీ విద్యాసంస్థలకు ఉచిత కరెంట్ ఇస్తూ గురువారం జీవో జారీ చేసింది.

1,400 విద్యా సంస్థలకు ప్రయోజనం

జిల్లాలోని సర్కారు విద్యాసంస్థల్లో నిబంధనల ప్రకారం గతంలోనే విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు, డిజిటల్ తరగతులు, ప్రొజెక్టర్ల వాడకం, కంప్యూటర్, ల్యాబ్, నీటి అవసరాల కోసం కరెంట్ వినియోగిస్తున్నారు. మన ఊరు-మన బడి కింద ఎంపికైన పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులు అందజేశారు. వీటన్నింటికి కలిసి ప్రతీ నెల రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు బిల్లులు వస్తున్నాయి. బిల్లులు కట్టేందుకు ప్రత్యేకంగా నిధులేమీ ఇవ్వకపోవడంతో ప్రధానోపాధ్యాయులకు భారంగా మారుతున్నాయి. ఉచిత కరెంట్ నిర్ణయంతో సంగారెడ్డి జిల్లాలోని దాదాపు 1,400 విద్యాసంస్థలకు ప్రయోజనం కలుగుతుంది. జిల్లాలో 1,247 ప్రభుత్వ పాఠశాలలు, 20 ప్రభుత్వ జూనియర్ కాలేజీలతో పాటు సుమారు 150కు పైగా రెసిడెన్షియల్ విద్యాసంస్థలున్నాయి.

సాగునీటికి భరోసా

మంత్రి దామోదర్ రాజనర్సింహ

సింగూరు నుంచి రెండు గేట్ల ద్వారా నీటి విడుదల



సింగూరు వద్ద పూజలు చేసి గేట్లను తెరుస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

పుల్‌కల్, సెప్టెంబరు 5: సింగూరు ప్రాజెక్టు గరిష్టస్థాయి నీటి మట్టానికి చేరుకోవడంతో గురువారం మంత్రి దమోదర్ రాజనర్సింహ రెండు గేట్లను తెరిచారు. కలెక్టర్ క్రాంతితో కలిసి ప్రాజెక్టు వద్ద ప్రత్యేక పూజలు చేసి, గంగ హారతి ఇచ్చారు. 4, 6వ నంబరు క్రస్టుగేట్ల స్విచ్ ఆన్ చేశారు. అనంతరం మాట్లాడుతూ సింగూరు ప్రాజెక్టు నిండటంతో తాగునీరు, సాగు జలాలకు ఢోకా లేదన్నారు. నీటిని విడుదల చేస్తుండడంతో మంజీరా నది పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం వారు ప్రాజెక్టు వద్ద ఉన్న టూరిజం పార్కును సందర్శించారు. బస్వాపూర్ గ్రామ శివారులో సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి కేటాయించనున్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్నారు. అసంపూర్తిగా ఉన్న ఆదర్శ పాఠశాల వసతిగృహాన్ని మంత్రి దామోదర్ పరిశీలించారు. పనులు వేగంగా సాగడం లేదని పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిహెబ్సీబా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఇరిగేషన్ సీఈ ధర్మ, సీఈ భీమ్, డీఈఈ నాగరాజు, జేఈఈ మహిపాల్‌రెడ్డి, ఆర్డీవో పాండు, తహసీల్దార్ కృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, పుల్కల్, చౌటకూర్ కాంగ్రెస్ మండలాల అధ్యక్షుడు దుర్గారెడ్డి, దశరత్, నాయకులు లక్ష్మారెడ్డి, గోవర్దన్, మల్లారెడ్డి, నందికంటి శ్రీనివాస్, మన్నె మధుసూధన్, సంగమేశ్వర్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

నిండుకుండలా 'సింగూరు'

సింగూరు ప్రాజెక్టు నిండింది. ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 28.749 టీఎంసీలకు చేరుకుంది. ప్రాజెక్టుకు 27,192 కూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 16,284 క్యూసెక్కులు, రెండు జల విద్యుత్ ఉత్పత్తి గేట్ల ద్వారా 2,822 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దిగువన ఉన్న మంజీరా రిజర్వాయర్ వద్ద మూడు క్రస్ట్ గేట్లు, ఒక స్కవర్ గేట్‌ను ఎత్తి ఘనపూర్ ప్రాజెక్టుకు నీటిని వదులుతున్నారు.

చురుకుగా జల విద్యుత్ ఉత్పత్తి

సింగూరు జల విద్యుత్ కేంద్రంలో 7.5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు టర్బయిన్లు విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. ఉత్పత్తి అయిన విద్యుత్ సదాశివపేట, జోగిపేట పవర్ గ్రిడ్లలో కలుపుతున్నారు.



మంజీర రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న నీరు

మొరాయిస్తున్న మంజీరా గేట్లు

- సింగూరుకు పెరిగిన వరద ప్రవాహం
- ప్రస్తుతం మూడు గేట్ల ఎత్తివేత
- మిగితా గేట్ల పనితీరుపై అనుమానాలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, సెప్టెంబరు 5: సింగూరు నుంచి వరద ప్రవాహం ముంచెత్తుతున్న క్రమంలో సంగారెడ్డిలోని మంజీర డ్యామ్ గేట్లపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారం క్రితం ఒక గేటును ఎత్తగా.. గురువారం మరో రెండు గేట్లను ఎత్తి నీటిని దిగువకు పంపిస్తున్నారు. సింగూరు పూర్తినిండడంతో 19వేల క్యూసెక్కుల నీటిని మంజీరా డ్యామ్‌కు వదిలారు. సింగూరుకు 33వేల క్యూసెక్కుల వరద వస్తుండడంతో మరో గేటును కూడా ఎత్తే అవకాశం కనిపిస్తోంది. ఇదే జరిగితే మంజీర డ్యామ్‌లో మరో రెండు గేట్లు ఎత్తాల్సి వస్తుంది. కానీ, గేట్లను పైకెత్తినా కిందకు దించడంలో ఇబ్బందులు తలెత్తుతాయని అనుమానిస్తున్నారు. మంజీర డ్యామ్‌కు సంబంధించి 3 క్రస్టుగేట్లతోపాటు ఒక స్కవర్ గేటు ద్వారా 24,365 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సింగూరు నుంచి వరద పెరిగితేనే మంజీర గేట్ల పనితీరు తేటతెల్లమవుతుంది. గతేడాది కూడా కొన్ని గేట్లు మొరాయించినా మరమ్మతులపై దృష్టిపెట్టలేదు. సమయం ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదనే చర్చ కొనసాగుతోంది. డ్యామ్‌లో పూడిక, డ్యామ్ పరిసరాల్లో అధ్వాన్న పరిస్థితులు ఉన్నప్పటికీ సరైన పర్యవేక్షణ చూపించలేదనే విమర్శలు ఉన్నాయి. హైదరాబాద్ మహానగరంలో తాగునీటికి కల్పతరువులా ఉన్న మంజీర డ్యామ్‌పై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న సంగారెడ్డి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 5 : ఉత్తమ సమాజాన్ని నిర్మించేది ఉపాధ్యాయులేనని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాబోధన ద్వారా పిల్లలు ఉన్నత శిఖరాలకు చేరేందుకు టీచర్లు దోహదం చేస్తారని అన్నారు. సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ పిల్లలను తీర్చిదిద్దడంలో తల్లి తరువాత స్థానం గురువులదేనని పేర్కొన్నారు. అనంతరం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేశారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈవో వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీఆర్వో పద్మజారాణి, ఎంఈవో వెంకటనర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

భవిష్యత్తుకు బాటలువేసేది గురువులే

మెదక్ అర్బన్, సెప్టెంబరు 5: విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది గురువులేనని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. మెదక్ కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు కలెక్టర్, డీఈవోతో కలిసి ఎమ్మెల్సీ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుల నుంచి టీచర్లు స్ఫూర్తిపొందుతారని పేర్కొన్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి విజయం వెనుక ఉపాధ్యాయుడుంటాడని అన్నారు. అనంతరం 54 మంది జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను వారు సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, జిల్లా మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.



మెదక్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన టీచర్లు

మల్లన్న సన్నిధిలో అదనపు కలెక్టర్ ప్రత్యేక పూజలు

చేర్యాల, సెప్టెంబరు 5 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ గురువారం కుటుంబసభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మల్లన్నను దర్శించుకుని అభిషేకం నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు. ఆలయాధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలకగా, అర్చకులు స్వామివారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుమారస్వామి, ఎస్‌ఐ రాజుగౌడ్, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఆకుల విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్ పాల్గొన్నారు.




మల్లన్న ఆలయంలో అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, మల్లన్నను దర్శించుకుని వెళుతున్న మహిళా అఘోరా

మల్లన్నను దర్శించుకున్న మహిళా అఘోరా

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని మహిళా అఘోరా గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మల్లన్నను దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు స్వామివారి ప్రసాదం అందించారు. తాను శైవక్షేత్రాలు పర్యటిస్తున్న క్రమంలో కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వచ్చినట్లు అఘోరా తెలిపారు. వంటినిండా విబూతి, చేతిలో త్రిశూలం ధరించిన మహిళా అఘోరా ఆలయంలో సందడి చేయడంతో భక్తులు ఆశ్చర్యానికి లోనయ్యారు.

కుంటలో ఇళ్లు.. కొన్నవాళ్లకు కడగండ్లు!

- ఇస్నాపూర్‌లో కుంటను పూడ్చి గృహాల నిర్మాణం
- రూ. 20 కోట్ల ప్రభుత్వ భూమికి ఎసరు
- భారీ వర్షాలకు నీట మునిగిన ఇళ్లు
- 'హైడ్రా' దూకుడుతో గుబులు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 5 : రియల్టర్ల లీలలకు సామాన్యులు బలవుతున్నారు. చెరువులు కుంటల్లో వెంచర్లు వేసి, అడ్డదారిలో అనుమతులు పొంది ఇళ్లను నిర్మించి అమాయకులకు అంటగట్టారు. హైడ్రా దూకుడుతో కొన్నవారు బెంబేలెత్తుతున్నారు. ఇస్నాపూర్ గ్రామంలో 372 సర్వే నంబరులో 1.5 ఎకరాల విస్తరణంలో 'లీలకుంట' ఉండేది. కుంట ఇస్నాపూర్ పరిధిలో ఉండగా, కుంట నీరు ముత్తంగి గ్రామ పరిధిలోని వ్యవసాయ పొలాలకు పారేది. ఈ కుంటకు ఆనుకుని వెంచర్ నిర్మాణం చేపట్టిన ఓ రియల్ సంస్థ కుంటపై కన్నేసింది. అధికారయంత్రాంగం సహకారంతో కుంటను కబ్జా చేసింది. హెచ్‌ఎండీఏ అనుమతులు, పంచాయతీ పాలకవర్గం ఎన్‌వోసి సాధించి నిర్మాణాలు చేపట్టింది. కుంట కబ్జాపై గ్రామస్థులు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రహరీని కూల్చేసి చేతులు దులుపుకున్నారు. అయినా సదరు సంస్థ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి విక్రయించింది. ఇదే వెంచర్‌కు ఆనుకుని ఉన్న ఎర్రకుంట ఎఫ్‌టీఎల్ పరిధిని రియల్ సంస్థ కబ్జా చేసిందని ఆరోపణలున్నాయి.



లీలకుంట ప్రాంతంలో నీటమునిగిన గృహ సముదాయాలు

కఠిన చర్యలు తీసుకోవాలి



లీలకుంటను కబ్జా చేసి గృహ సముదాయాలు నిర్మించిన రియల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలి. కబ్జాకు సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలి.

-యాదగిరి, మాజీ వార్డు సభ్యుడు, ఇస్నాపూర్

నీట మునిగిన ఇళ్లు

తాజాగా కురిసిన భారీ వర్షాలకు లీల కుంట పరిధిలో నిర్మించిన గృహసముదాయం లోకి నీళ్లు వచ్చాయి. అన్ని అనుమతులు ఉన్నాయని ఇళ్లు కొంటే.. కుంటలోనే ఇళ్లు నిర్మించారన్న విషయం బయటపడింది. ఇది తెలుసుకున్న ఇళ్ల యజమానులు హైడ్రా దూకుడుతో భయాందోళనకు గురవుతున్నారు. కుంటలో ఉన్న నిర్మాణాలను కూల్చేసి కుంటను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. హెచ్‌ఎండీఏ అనుమతులు చూసే తాము ఈ నిర్మాణాలను కొన్నామని, ఇళ్లను కూల్చేసినా రియల్ సంస్థ యాజమాన్యం నుంచి వేరే చోట గృహాలు కానీ, డబ్బు కానీ ఇప్పించాలని యజమానులు కోరుతున్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

- ఎమ్మెల్సీ కోదండరామ్‌కు ఎస్టీటీయూ వినతి



కోదండరామ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మహిపాల్‌రెడ్డి, వెంకటేశం

వెల్దుర్తి, సెప్టెంబరు 5 : 12 నుంచి 14 సంవత్సరాలుగా ఒకే పాఠశాలలో పని చేస్తూ ఇటీవల జరిగిన ఎస్టీటీ ఉపాధ్యాయులు బదిలీ అయినప్పటికీ వారిని పాత పాఠశాలల్లోనే కొనసాగిస్తున్నారని, వెంటనే రిలీవ్ చేయాలని ఎస్టీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డితో కలిసి వెంకటేశం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో ప్రాథమిక పాఠశాలలను బలహీన పరుస్తున్నారన్నారు. ప్రైమరీ పాఠశాలల్లో బోధనేతర పనులు, ఆన్‌లైన్, అడ్మినిస్ట్రేషన్ కోసం ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. 5,571 అదనపు ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్ పోస్టులను మంజూరు చేసి సెకండరీ గ్రేడ్ టీచర్లకు డీఎడ్, బీఎడ్ కామన్ సీనియారిటీతో పదోన్నతులు కల్పించాలని, విద్యా వ్యవస్థలో అత్యధిక సంఖ్యలో ఉన్న ప్రాథమిక పాఠశాలలకు సెంకడరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రాధాన్యం కల్పించాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీని కోరారు.

రాయికుంట చెరువును ఆక్రమించిన మాజీ సర్పంచ్‌పై
కఠిన చర్యలు తీసుకోవాలి

- బాధిత రైతులు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెలిమెల గ్రామంలోని సర్వే నంబర్ 421లో ఉన్న రాయికుంట చెరువును మాజీ సర్పంచ్ మహిపాల్‌గౌడ్ కబ్జాచేశారని బాధిత రైతులు ఆరోపించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతులు ఖానాపురం ఎల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రాయికుంట చెరువులోని 20ఎకరాల 30గుంటల స్థలాన్ని మహిపాల్‌గౌడ్ ఆక్రమించి తూమును తొలగించారని ఆరోపించారు. అలాగే సర్వేనంబర్ 15లో మరో 20ఎకరాల ప్రభుత్వభూమిని ఆక్రమించి అక్రమ కట్టడాలు కట్టారన్నారు. మహిపాల్‌గౌడ్ కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదు చేశామని వారు చెప్పారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరించి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

జిన్నారంలో కేంద్ర వైద్య బృందం పర్యటన



వివరాలు సేకరిస్తున్న వైద్య బృందం

జిన్నారం, సెప్టెంబరు 5: మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర వైద్యుల బృందం గురువారం జిన్నారంలో పర్యటించారు. జిన్నారం పంచాయతీ పెద్దమ్మగూడెంలో యూనియన్ సెక్రటరీ గవర్నమెంటు ఆఫ్ ఇండియా మలయ్‌కుమార్, డాక్టర్ అమర్‌సింగ్, రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎంవో డాక్టర్ ప్రవీణ్, స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ కోమల్ తారక్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు నివాసాలకు వెళ్లి మాస్ డ్రగ్ కార్యక్రమంలో ట్యాబ్లెట్ల పంపిణీపై వివరాలు సేకరించారు. సీజనల్ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం నల్తూరు ప్రభుత్వ పాఠశాల, హెటిరో డ్రగ్స్ పరిశ్రమను వారు సందర్శించారు.

చిరాగ్‌పల్లిలో కొండెంగకు అంత్యక్రియలు




కొండెంగకు అంతిమసంస్కారాలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

జహీరాబాద్, సెప్టెంబరు 5 : మండలంలోని చిరాగ్‌పల్లి గ్రామంలో గురువారం ఉదయం కొండెంగ రోడ్డును దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో చనిపోయింది. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్థులు మృతిచెందిన కొండెంగకు హిందూ సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారాలను నిర్వహించారు. రోడ్డుపైనే కొండెంగకు స్నానం చేయించి, అంతిమ సమయంలో చేపట్టాల్సిన కార్యక్రమాలను చేపట్టి, టపాసుల పేలుస్తు పాడేపై మోసుకెళ్లి ఖననం చేశారు.

కేతకీ హుండీ ఆదాయం రూ.43.22 లక్షలు

ఝరాసంగం, సెప్టెంబరు 5 : దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఈ హుండీ లెక్కింపు ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగింది. 59 రోజుల్లో హుండీ ఆదాయం రూ.43.22 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో శశిధర్ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, అధికారులు రంగరావు, సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలిని
బంధువులకు అప్పగించిన పోలీసులు

చిలప్‌చెడ్, సెప్టెంబరు 5: ప్రధాన రోడ్డు పక్కన ఒంటరిగా మతిస్థిమితం లేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని గమనించిన పోలీసులు ఆమెను చేరదీసి తమ సంబంధీకులకు అప్పగించిన సంఘటన మండల పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాముండేశ్వరి ఆలయం సమీపంలో 70 సంవత్సరాల వృద్ధురాలు మతిస్థిమితం లేని స్థితిలో ఒంటరిగా ఉండడాన్ని గమనించిన పోలీసులు ఆమెను తీసుకొచ్చి.. నెమ్మదిగా వివరాలు అడగగా తన పేరు పట్లోళ్ల నర్సమ్మ, గ్రామం బచ్చుగూడ, పటాన్‌చెరు మండలం అని తెలిపింది. ఈ సమాచారం మేరకు పటాన్‌చెరు పోలీసులకు సమాచారాన్ని చేరవేశారు. విచారణ చేసిన అక్కడి పోలీసులు వృద్ధురాలి బంధువులకు విషయం తెలిపారు. వారు చిలప్‌చెడ్ పోలీసులను సంప్రదించడంతో వారికి ఆమెను అప్పగించినట్లు తెలిపారు. కానీ ఆమె ఇక్కడికి ఎలావచ్చిందోనన్న విషయం తెలియలేదని పోలీసులు తెలిపారు.



కోహీర్ నారింజ వాగు పరీవాహక ప్రాంతంలోని మినుముల పంట పొలంలో చేరిన వరద నీరు

నాలుగైదు రోజులుగా కురిసిన వర్షాలు రైతులకు కడగండ్లను మిగిల్చాయి. వరుణుడి ఉగ్రరూపంతో పంట పొలాల్లోకి నీరు చేరింది. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నారింజ వాగు పరీవాహక ప్రాంతాల్లో సోయా, మినుముల పంటలు దెబ్బతిన్నాయి. పంటలు వర్షార్పణమయ్యాయని, అధికారులు సర్వే చేసి పంట నష్టపరిహారం ఇప్పించాలని సంగారెడ్డి, మెదక్ జిల్లాల రైతులు కోరుతున్నారు. సిద్దిపేట జిల్లాలో వ్యవసాయాధికారులు పంట పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి రైతులకు సూచనలిస్తున్నారు.

కడగండ్లు

వరుణుడి ఉగ్రరూపంతో అన్నదాతకు తీరని నష్టం

పలుచోట్ల ఇంకా వరద నీటిలోనే పొలాలు

కోహీర్, సెప్టెంబరు 5 : కోహీర్ నారింజ వాగు పరీవాహక ప్రాంతాల్లోని పంట పొలాలన్నీ ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. కోహీర్, పైడిగుమ్మల్, పోతిరెడ్డిపల్లి, కవెల్లి, రాజనెల్లి, గురుజువాడ, మద్రి గ్రామాల పరిధిలో పంటలు దెబ్బతిన్నాయి. పొలాల్లో చేరిన వరద నీరు బయటకు వెళితే తప్ప నష్ట నివారణ నుంచి గట్టెక్కే పరిస్థితి కనిపించడం లేదు. నారింజ పరీవాహక ప్రాంతాల్లో అధికంగా నల్లరేగడి భూములు ఉండడంతో రైతులు ప్రతీ ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, పత్తి, సోయా, మినుము పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. నారింజ పరీవాహ ప్రాంతంలో సాగునీరు లేకపోవడంతో చాలామంది రైతులు ఖరీఫ్‌లోనే పంటలను సాగు చేస్తారు. ఖరీఫ్ సీజన్‌లో ఆర్థికంగా లబ్ధి పొందాలనుకున్న రైతులకు అధిక వర్షాలు కురియడంతో కడగండ్లే మిగిలాయి. గతేడాది భారీ వర్షాలకు మండలంలో చాలా పంట దెబ్బతిన్నది.

వాలిపోతున్న తెల్లబంగారం

అల్లాదుర్గం : నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో అల్లాదుర్గం మండలంలోని పలు గ్రామాల్లో పత్తి పంట దెబ్బతినడంతో తీవ్రనష్టం వాటిల్లినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో నల్లరేగడి భూములు ఉండటంతో ఎక్కువగా రైతులు పత్తి సాగుపైనే ఆసక్తి కనబరచగా ఈ సీజన్‌లో 13 వేల పైచిలుకు ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. రైతులు ఆశించిన స్థాయిలో పంట ఎదిగి పూత పూసి, కాత దశకు చేరుకునే సమయంలో వర్షంతో మండలంలోని ముప్పారం, బహిరన్‌దిబ్బ, చిల్వర్, అల్లాదుర్గం తదితర గ్రామాల శివారులో పత్తి పంటలు దెబ్బతిన్నాయి. పత్తి వాలిపోవడం, నీరు పట్టడం తదితర కారణాలతో దిగుబడి తగ్గి తీవ్రంగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

రేగోడు మండలంలో..

రేగోడు : మండలంలో అధికంగా పత్తి సాగు చేస్తున్నారు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షానికి పత్తి పంట నీరు పట్టి వాడిపోతుందని రైతులు వాపోతున్నారు. పూత, పిందెలు రాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెసర, మినుము పంటలు వర్షానికి దెబ్బతిన్నాయి.

పంటల పరిశీలన.. సూచనలు

సిద్దిపేట జిల్లాలో వ్యవసాయాధికారులు గురువారం పంట పొలాలను సందర్శించి నష్టాన్ని అంచనా వేసి, రైతులకు పలు సూచనలు చేశారు.

● చిన్నకోడూరు : మండలంలోని అల్లీపూర్, ఇబ్రహీంనగర్, చిన్నకోడూరు, గోనెపల్లి, అనంతసాగర్ గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా 90 ఎకరాల్లో వరి, 30 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు ఏవో జయంత్‌కుమార్ తెలిపారు.

● దౌల్తాబాద్ : మండల పరిధిలోని గాజులపల్లి గ్రామంలో మొక్కజొన్న పంట నేలకొరిగింది. గురువారం దుబ్బాక డివిజన్ ఏడీఏ మల్లయ్య పంట నష్టపోయిన రైతులు మారుపాక రమేష్, పడిగే కనకయ్య, మోతే భిక్షపతితో కలిసి దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. మండలంలో 10 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని ఏడీఏ మల్లయ్య తెలిపారు. ప్రస్తుతం వర్షాల వల్ల పంట చేలల్లో నీరు నిల్వకుండా బయటకు పంపించాలని రైతులకు సూచించారు.

● మద్దూరు : మండలంలోని ధర్మారం గ్రామంలో మండల వ్యవసాయాధికారి బి.రామకృష్ణ, ఏఈవో అఖిల్‌తో కలిసి మొక్కజొన్న పంటను సందర్శించారు. అధిక వర్షాల వల్ల బ్యాక్టీరియా కాండం కుళ్లుతెగుళ్లు ఆశించే అవకాశం ఉందన్నారు. ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పోటాషియం వేసుకోవాలని సూచించారు. కాండం కుళ్లు నివారణకు ఎకరాకు బ్లీచింగ్ పౌడర్‌ను ఐదు కిలోలు వేసుకోవాలన్నారు. కత్తెర పురుగు సోకితే 0.3 క్లోరాంత్రినిపోల్‌ను పిచికారీ చేయాలన్నారు. ఈ పాటు రైతులు పాల్గొన్నారు.

నీటి నిల్వతో పత్తిలో 'పారా విల్ట్'



మర్కుక్ ఇప్పలగూడెంలో పత్తిపంటను పరిశీలిస్తున్న ఏవో

మర్కుక్/జగదేవ్‌పూర్ : మర్కుక్ మండలంలోని ఇప్పలగూడెం, చేబర్తి గ్రామాల్లో దెబ్బతిన్న పత్తి పొలాలను మండల వ్యవసాయ అధికారి డాక్టర్ టి.నాగేందర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు రజనీకాంత్, విష్ణువర్దన్‌తో కలిసి పరిశీలించారు. జగదేవ్‌పూర్ మండలంలోని ఆలిరాజుపేటలో పత్తి పంటలను మండల వ్యవసాయాధికారి వసంతరావు సందర్శించారు. వారు రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం అధిక వర్షాలకు పత్తి పొలాల్లో నీరు నిల్వడంతో పారా విల్ట్ లేదా సడెన్ విల్ట్ అధికంగా ఉండటం గమనించామని తెలిపారు. దీని లక్షణాలు ఇతర తెగుళ్ల లక్షణాలను పోలి ఉండటంతో అయోమయానికి గురిచేస్తుందన్నారు. ఈ రుగ్మతతో ఆకులు ఎండిపోవడం, రంగు మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. వేగంగా పెరిగే మొక్కలు, అధికంగా పైఆకులు, పత్తికాయలు ఉన్న మొక్కల్లో ఈ రుగ్మత ప్రభావం చూపిస్తుందని పేర్కొన్నారు. కాయలు, ఆకులు రాలిపోవడం, కాయలు విచ్చుకోకపోవడం జరగవచ్చని తెలిపారు. దీని నివారణకు పొలంలో ఉన్న నీటిని బయటికి పంపించాలన్నారు. సాధ్యమైనంత వరకు వేర్లకు గాలి తగిలేటట్లు చేయాలి. తరువాత ఒక లీటర్ నీటికి 5 గ్రాముల 19-19-19 గానీ లేదా 13-0-45 కానీ, 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ కలిపి ద్రావణాన్ని తయారు చేసి మొక్కల వేర్లు తడిచేటట్లు పోసుకోవాలి. ఎండలు వచ్చినట్లయితే మొక్కలు త్వరగా కోలుకుంటాయని తెలిపారు.







కోహీర్, అల్లాదుర్గం మండలం ముప్పారంలో నీటిలో మురుగుతున్న పత్తి, రేగోడు మండలం పెద్దతండాలో ఆరబెడుతున్న మినుముల పంట, చిన్నకోడూరులో వరి పంటను పరిశీలిస్తున్న ఏవో, దౌల్తాబాద్ మండలం గాజులపల్లిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

కనిపించకుండా పోయిన వ్యక్తి.. చెరువులో శవమై లభ్యం



మెగావత్ సురేష్(ఫైల్)

కౌడిపల్లి, సెప్టెంబరు 5 : కనిపించకుండా పోయిన వ్యక్తి చెరువులో శవమై కనిపించిన సంఘటన మండల కేంద్రంలోని జరిగింది. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. బతుకమ్మ తండాకు చెందిన మెగావత్ సురేష్(35) ఈనెల 3వతేదీన వ్యవసాయ పనుల నిమిత్తం బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు బంధువులు, సురేష్ స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఇదే క్రమంలో బుధవారం కౌడిపల్లి పెద్దచెరువు సమీపంలో దుస్తులు, సెల్‌ఫోన్ కనిపించాయి. గురువారం మృతదేహం చెరువులో లభించింది. సురేష్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లే లక్ష్యం

- పగలు రెక్కీ.. రాత్రుల్లో దొంగతనం
- వాహన తనిఖీల్లో నిందితుడిని పట్టుకున్న పోలీసులు



రికవరీ చేసిన నగలను, నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

కొండాపూర్, సెప్టెంబరు 5 : పగలంతా రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను లక్ష్యం చేసుకుని రాత్రి వేళలో దొంగతనానికి పాల్పడుతున్న నిందితుడిని కొండాపూర్, సంగారెడ్డి సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం కొండాపూర్ సీఐ చంద్రయ్య వివరాలను వెల్లడించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెంకు చెందిన సన్నిధి ఆంజనేయులు(30) తాపీ మేస్త్రీగా పనిచేస్తుంటాడు. జల్సాలకు, తాగుడుకు బానిసై ఇళ్ల, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. బుధవారం రాత్రి మల్కాపూర్ చౌరస్తాలో కొండాపూర్ పోలీసులు, సీసీఎస్ పోలీసులతో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానంగా కన్పించిన ఆంజనేయులును అదుపులోకి తీసుకుని విచారించారు. 30 ఇళ్ల చోరీల్లో 39.4 తులాల బంగారం, 188 తులాల వెండి, రూ.9.50 లక్షల నగదు, రెండు బైకులను అపహరించినట్లు వెల్లడించారు. మొబైల్ ఫోన్ వాడకుండా ఎటువంటి సామగ్రి తీసుకెళ్లకుండా ఒంటరిగా వెళ్లి ఇంటి ఆవరణలో ఉండే ఇనుపరాడ్లు, రాళ్లతో తాళాలను పగులగొట్టి అపహరించేవాడు. నిందుతడిపై మెదక్, సంగారెడ్డి, సూర్యాపేట, నల్గొండ, ఖమ్మం, వరంగల్, వికారాబాద్ జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌లలో దొంగతనం కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందుతుడి నుంచి 15 తులాల బంగారంను రికవరీ చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న కొండాపూర్, సీసీఎస్ పోలీసులకు సీఐ రివార్డులను అందజేశారు.

తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్‌లో నగలు చోరీ

తూప్రాన్, సెప్టెంబరు 5 : తల్లిగారింటి వద్ద ఉన్న బంగారు నగలను ఇంటికి తీసుకెళ్తున్న మహిళ బ్యాగ్‌లో నుంచి చోరీకి గురైన సంఘటన తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం సాయంత్రం చోటుచేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన చల్ల శ్రీకాంత్‌రెడ్డి భార్య చల్ల మమత గురువారం ఉదయం శివ్వంపేట మండలం ఉసిరికపల్లిలోని తల్లిగారింటికి వెళ్లింది. అన్న భార్య రజిత గత నెల 20న పెళ్లి కోసం మమత వద్ద ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు లాంగ్ చైన్, కమ్మలు తీసుకుని స్వగ్రామానికి బయలుదేరింది. సాయంత్రం 5 గంటలకు ఉసిరికపల్లి నుంచి గజ్వేల్ వెళ్లే బస్సులో తూప్రాన్ వరకు వచ్చింది. తూప్రాన్ నుంచి రామాయంపేట నుంచి సికింద్రాబాద్ వెళ్లే బస్సులో స్వగ్రామం వెళ్లేందుకు 5.30 గంటలకు ఎక్కింది. బస్సులో కూర్చోగానే హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకున్న బంగారు ఆభరణాలు చూడగా కనిపించలేదు. తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్‌లో వెతికినప్పటికీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

10న మెడికల్ కాలేజీలో వాక్-ఇన్ ఇంటర్వ్యూలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 5 : సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఈ నెల 10వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. సుధామాధురి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్స్‌ను కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేయుటకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలు కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, ఆసక్తి కలిగిన వారు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హాజరుకావాలని ఆమె కోరారు.

పాపన్నపేట పీహెచ్‌సీకి సుస్తీ!

- గ్రామాల్లో విష జ్వరాల పడగ.. అందని వైద్యం
- ఇటీవల డెంగ్యూతో బాలుడి మృతి

పాపన్నపేట, సెప్టెంబర్ 5 : పాపన్నపేట మండలంలో విషజ్వరాలు విలయతాండవం చేస్తున్నాయి. మండల పరిధిలోని చీకోడ్ గ్రామంలో ఆరు డెంగ్యూ కేసులు వెలుగులోకి వచ్చాయి. కాగా అందులో ఒక బాలుడు ఇటీవలే మృతి చెందిన విషయం తెలిసిందే. మిన్పూర్ గ్రామంలో ఒకే ఇంట్లో ముగ్గురు డెంగ్యూ బారిన పడ్డారు. ఇలా మండల వ్యాప్తంగా డెంగ్యూ, చికున్ గున్యా, వైరల్ జ్వరాలతో మండల వాసులు ప్రైవేటు దవాఖానలలో వేలు ఖర్చు పెట్టుకుంటున్నారు. మండల పరిధిలో 24 గంటలు వైద్య సేవలు అందించే పాపన్నపేటలో ఒక ఆరోగ్య కేంద్రం ఉండగా పొడ్చన్‌పల్లిలోనూ మరో ఆరోగ్య కేంద్రం ఉంది. రెండు ఆసుపత్రుల్లోనూ సిబ్బంది కొరత వెక్కిరిస్తుంది. ఉన్న సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జిల్లా వైద్యాధికారి పాపన్నపేట ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన విషయం తెలిసిందే. డెంగ్యూ కేసుల నమోదుపై ఆయనను వివరణ కోరగా పాపన్నపేట మండలంలో ఒక్క డెంగ్యూ కేసు నమోదు కాలేదని పేర్కొనడం విడ్డూరంగా ఉంది. వైద్య సిబ్బంది మాత్రం డెంగ్యూ కేసులు ఉన్నట్లు వారే స్వయంగా ఒప్పుకుంటున్నారు.



డెలివరీ గదిలో ఊడిన కిటికీ రెక్కలు



పాపన్నపేట పీహెచ్‌సీలో ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యుడి కుర్చీ

అందని ద్రాక్షలా వైద్యం

పాపన్నపేట పీహెచ్‌సీలో ఒకపక్క సిబ్బంది కొరత వేధిస్తుంటే.. ఇన్‌చార్జి డాక్టర్ల సేవలు రోగులకు అందని ద్రాక్షలా మారాయి. చిన్న చిన్న రోగాలకు సైతం వైద్యం అందించలేని దుస్థితిలో పాపన్నపేట ఆరోగ్య కేంద్రం ఉంది. ఉన్న సిబ్బంది విధులకు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు పోతారో.. తెలియని పరిస్థితి నెలకొన్నది. వచ్చిన సిబ్బంది వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆసుపత్రిలో ఉన్న గదుల పైకప్పులన్నీ లీకేజీలు అవుతుండటంతో లోపలి భాగం చిత్తడిగా మారింది. డెలివరీ గదితో పాటు ఇతర గదులకు కిటికీ రెక్కలు లేవు. ఆస్పత్రి ఆవరణ అపరిశుభ్రంగా ఉంది. రాత్రివేళల్లో విధులు నిర్వహించాల్సిన ఏఎన్ఎంలు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. గ్రామానికి కొంత దూరంలో ప్రభుత్వ దవాఖాన ఉండటంతో వారికి ఇబ్బందులు తప్పడంలేదు. కరెంటు పోయిన సందర్భాలలో ఇన్వర్టర్ సౌకర్యం లేక చిమ్మ చీకట్లోనే ఏఎన్ఎంలు విధులు నిర్వహించాల్సి వస్తుంది. 2008లో ఇక్కడ ఆయుష్ పరిధిలో హోమియో వైద్యం అందుబాటులోకి తెచ్చినప్పటికీ సిబ్బంది కొరత ఉంది. ఇక్కడికి కేటాయించిన వైద్యుడు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో హోమియో వైద్యం అందించే వారే కరువయ్యారు.

పోస్టులు ఖాళీ

ఆస్పత్రిలో శాశ్వత వైద్యుడి పోస్టుతో పాటు మెడికల్ సూపర్‌వైజర్ పోస్టు ఖాళీగా ఉంది. అలాగే రెగ్యులర్ స్టాఫ్‌నర్స్, ముగ్గురు ఎన్‌హెచ్ స్టాఫ్ నర్సుల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. వీరితో పాటు ముగ్గురు సెకండ్ ఏఎన్ఎంల పోస్టులు ఖాళీ ఉండగా గత కొన్ని సంవత్సరాలుగా వీటిని భర్తీ చేయడంలేదు. శాశ్వత వైద్యులు లేకపోవడంతో శంకరంపేట(ఎ) నుంచి ఒకరిని, రామాయంపేట నుంచి మరొకరిని ఇక్కడ ఇన్‌చార్జి డాక్టర్లుగా నియమించారు. వీరు ఎప్పుడు వస్తారో ఎవరికీ తెలియదు. వచ్చినా సమయానికి రారు అంటూ రోగులు వాపోతున్నారు.



ఆస్పత్రి ఆవరణలో చేరిన నీరు

లచ్చిరెడ్డీ... చౌకబారు ప్రకటనలు మానుకో

- వంద కోట్లు తానే విరాళం ఇచ్చినట్టు వ్యవహరించడం సరికాదు
- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ తీవ్రంగా ఖండిస్తుంది
- ఉద్యోగుల సంఘం జిల్లా జేఏసీ చైర్మన్ జావిద్‌అలీ ధ్వజం



మాట్లాడుతున్న జావిద్ అలీ

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 5 : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ వరద బాధితులకు ఆపన్నహస్తంగా నిలిచి ప్రభుత్వానికి రూ.130 కోట్ల విరాళంగా ఇచ్చిన తరుణంలో నాయకుడు లచ్చిరెడ్డి తానే వంద కోట్లు ఇచ్చినట్లు ప్రకటించడాన్ని ఉద్యోగుల సంఘం జిల్లా జేఏసీ చైర్మన్ జావిద్‌అలీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. సంగారెడ్డిలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండి, గత ప్రభుత్వానికి కొమ్ముకాసిన లచ్చిరెడ్డి, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. గుర్తింపు పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు భాగస్వామిగా ఉన్న జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు నాయకత్వంలో వారి శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న సందర్భంలో లచ్చిరెడ్డి ప్రకటన గందరగోళం సృష్టించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎలాంటి గుర్తింపు లేని సంఘం నాయకుడు లచ్చిరెడ్డి అని అన్నారు. ఈ సమావేశంలో జేఏసీ కో చైర్మన్ వైద్యనాథ్, పెన్షనర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి వి.రవి, అసోసియేట్ అధ్యక్షుడు కసిని శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, టీజీవో కార్యదర్శి సంతోష్, టీహెచ్‌డబ్ల్యూవో రాష్ట్ర అధ్యక్షుడు గౌస్, విజయ్‌కుమార్, రవికృష్ణ, కృష్ణ, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్ ఎస్‌బీఐ వద్ద ఖాతాదారుల ఆందోళన

- సర్వర్ పనిచేయడం లేదని బ్యాంకుకు తాళం
- నెలరోజులైనా రుణాలు రెన్యూవల్ చేయంలేదని ఆగ్రహం

తూప్రాన్, సెప్టెంబరు 5 : సర్వర్ పనిచేయకపోవడంతో బ్యాంకుకు తాళం వేయడం, నెల రోజులుగా రుణాల కోసం వస్తున్న రైతులను పట్టించుకోకపోవడంపై ఖాతాదారులు ఆగ్రహించారు. బ్యాంకు వద్దకు వచ్చిన ఖాతాదారులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వద్ద గురువారం చోటుచేసుకున్నది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సర్వర్ ఎన్‌బీసీకి బుధవారం మార్చారు. ఒక్కొక్క బ్యాంక్ శాఖను మార్చుతుండగా, బుధవారం తూప్రాన్ బ్యాంకు శాఖను మార్చారు. కాగా, కొత్త సర్వర్‌లోకి మార్చినప్పటికీ గురువారం పనిచేయలేదు. సర్వర్ డౌన్ కారణంగా తూప్రాన్ బ్యాంకుకు తాళం వేసి మూసేశారు. దాంతో బ్యాంకు వచ్చిన ఖాతాదారులు, రుణమాఫీ జరిగి కొత్త రుణాలు తీసుకోడానికి వచ్చిన రైతులు బ్యాంకు వద్ద పెద్దఎత్తున గుమిగూడారు. రుణమాఫీ పొందిన రైతులకు నెల రోజులు గడిచినప్పటికీ కొత్త రుణాలు ఇవ్వడంలేదని ఆగ్రహించారు. సర్వర్ పనిచేయడంలేదని బ్యాంకుకు తాళం వేసి బయట నిలిపివేశారని మండిపడ్డారు. బ్యాంకుకు వస్తే సరైన సమాదానం చెప్పకుండా విసుక్కుంటున్నారని రైతులు ఆరోపించారు. బ్యాంకుకు తాళం వేసి పెట్టడం, రుణాలు ఇవ్వకపోవడంపై ఆగ్రహిస్తూ ఖాతాదారులు ఆందోళన చేపట్టారు. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ రామేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా సర్వర్ ప్రాబ్లమ్ రావడంతోనే బ్యాంకుకు తాళం వేసి ఉంచామని, లోపలకు వస్తే ఇబ్బంది పెడతారని అలా చేశామన్నారు. రుణాల విషయం తన దృష్టికి రాలేదని, కొత్తగా 15 రోజుల క్రితమే బ్యాంకుకు వచ్చినట్లు చెప్పారు. ఒక్కరే ఫీల్డ్ ఆఫీసర్ ఉండటంతో కొత్తగా ఎక్కువ రుణాలు ఇవ్వలేకపోతున్నామని తెలిపారు.



తూప్రాన్‌లోని ఎస్‌బీఐ బ్యాంకుకు తాళం వేయడంతో బయట ఖాతాదారులు

అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు తపస్య



పవర్ లిఫ్టింగ్ చేస్తున్న సూరినేని తపస్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి), సెప్టెంబరు 5 : అతిపిన్న వయసులో అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు సంగారెడ్డి యువ లిఫ్టర్ సూరినేని తపస్య అర్హత సాధించి, సంచలనం సృష్టించింది. 11 ఏళ్ల ప్రాయంలోనే పవర్‌లిఫ్టింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే అరుదైన అవకాశం తపస్యకు లభించింది. ఇటీవల జరిగిన జాతీయ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన తపస్య వచ్చే నవంబరులో అమెరికాలో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. ఈ పోటీల్లో తపస్య 44 కిలోల 'రా లిఫ్టింగ్' ఈవెంట్‌లో పోటీపడనుంది. అయితే, ఈ పోటీల్లో పాల్గొనేందుకు రూ.2.50 లక్షల వరకు ఖర్చు అవనుండడంతో పేద కుటుంబానికి చెందిన ఈ అమ్మాయి ప్రభుత్వం, దాతల సహాయం కోసం ఎదురు చూస్తోంది. ఈ అమ్మాయికి సహాయం చేయదలిచిన వారు 8790022909 ఈ నెంబరుకు సంప్రదించవచ్చు.

చెట్టెక్కిన చింతకాయ

వినాయక ఉత్సవాలకు కొత్త పచ్చడి కష్టమే



నారాయణఖేడ్, సెప్టెంబరు 5: వినాయక ఉత్సవాలు వచ్చాయంటే ప్రతి ఒక్కరికి గుర్తుకు వచ్చేది కొత్త చింతకాయ పచ్చడి, తుమ్మికూర. ఈసారి ఉత్సవాలకు వీటిని రుచిచూడటం కష్టమే అంటున్నారు. ఈ సంవత్సరం చింతకాయ కాత అంతంత మాత్రంగానే ఉండడానికి తోడు, ప్రస్తుతం వర్షాలు అధికంగా కురియడంతో, కాసిన కొద్దిపాటి చింతకాయను కూడా చెట్టు నుంచి తెంపలేని పరిస్థితి నెలకొంది. వర్షాల వల్ల తుమ్మికూర సైతం అంతంత మాత్రంగానే పండింది. దీంతో పండగకు ప్రధానంగా అవసరమైన చింతకాయను గురువారం నారాయణఖేడ్ మార్కెట్‌లో కిలో రూ.200 చొప్పున విక్రయించారు. అయినప్పటికీ పండగకు కొత్త చింతకాయ అవసరం కావడంతో ఎంతోకొంత కొనుగోలు చేస్తున్నారు. తుమ్మికూర గురువారం వరకు మార్కెట్‌లోకి అందుబాటులోకి రాలేదు.


నారాయణఖేడ్: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి


పటాన్‌చెరు: సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నీలం మధు


సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యాజమాన్యం, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

నారాయణఖేడ్, సెప్టెంబరు 5: ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైందని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం రాత్రి నారాయణఖేడ్‌లోని సాయిబాబాఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఎక్కడ, ఎవ్వరూ ఎంత పెద్ద పదవిలో ఉన్నా.. వారు ఉపాధ్యాయుల కృషి వల్లే ఆ స్థాయికి ఎదగగల్గుతారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్‌ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ప్రశంసాపత్రంతోపాటు శాలువాతో ఎమ్మెల్యే సత్కరించారు. కాగా స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో మేనేజర్ పరమేష్ ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే ఖేడ్ ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు సత్యనారాయణ, కవిత ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తుండడంతో వారిని డీఎం మల్లేశయ్య సహాయ మేనేజర్ నర్సింహులు, పీఆర్వో పాండు, బస్సు పాస్ కౌంటర్ ఇన్‌చార్జి మోహన్ శాలువాతో సన్మానించారు. అలాగే ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు.

●పటాన్‌చెరు రూరల్: గురువులు విద్యార్థుల భవిష్యత్ మార్గదర్శకులని మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధుముదిరాజ్ అన్నారు. టీచర్స్‌డేని పురస్కరించుకొని చిట్కుల్ ఎస్ఎంఆర్ క్యాంప్ కార్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

●సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డిలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు విజయకుమార్‌రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ హెడ్ జయబాలరెడ్డి, పాల్గొన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో తారా డిగ్రీ కళాశాలలో దినోత్సవాన్ని నిర్వహించారు. సంగారెడ్డి చౌరస్తా సమీపంలోని శ్రీఅక్షయ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో పీఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్టేట్ ఇంటలిజెన్స్ ఎస్పీ శిరీషరాఘవేంద్ర మాట్లాడారు. అనంతరం బీవీఎం స్కూల్ డైరెక్టర్ లింగాగౌడ్, రిటైర్డ్ పీజీహెచ్ఎం రుద్రప్ప మాట్లాడారు. అంతకుముందు గతేడాది ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌లో ప్రతిభ కనబర్చిన పలువురు విద్యార్థులకు ల్యాప్‌టాప్స్, క్యాష్ అవార్డులు, గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీశైలం, డైరెక్టర్లు సుధాకర్ జోషి, భానుచందర్‌రెడ్డి, రాజుగౌడ్ పాల్గొన్నారు.

●సదాశివపేట: సదాశివపేట పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) మెయిన్ బ్రాంచ్‌లో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెట్ హెడ్ మాస్టర్ ఆర్.రవీంద్రనాథ్, దిగ్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణితం ఉపాధ్యాయురాలు అశ్వినీలను బ్యాంక్ మేనేజర్ కె.నాగేందర్ ఆధ్వర్యంలో బ్యాంక్ సిబ్బంది సన్మానించారు.

●జిన్నారం: జిన్నారం మండలవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిన్నారం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజిరెడ్డి ఘనంగా సన్మానించారు.

●ఝరాసంగం: మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ జయతి సందర్భంగా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన ఝరాసంగంలోని అక్షర భారతి స్కూల్‌లోని విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు.

●నాగల్‌గిద్ద: మండల పరిధిలోని మోర్గి మోడల్ స్కూల్, ముక్టాపూర్ ప్రాథమిక పాఠశాల, కారముంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు.

●వట్‌పల్లి: వట్‌పల్లిలోని డాన్ బాస్కో పాఠశాల విద్యార్థులు బుధవారం ఘనంగా స్వయం పాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

●హత్నూర: హత్నూర మండల పరిధిలోని లింగాపూర్, నస్తీపూర్, సిరిపుర గ్రామాల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చార్ల మాణయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లింగాపూర్ పాఠశాల ఉపాధ్యాయులకు శాలువా, పూలమాలతో సన్మానం చేశారు.

●జహీరాబాద్: నియోజకవర్గంలోని జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని శ్రీకృష్ణవేణి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాలల డైరెక్టర్ వెదిరే అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ దినేష్, లక్ష్మి పాల్గొని, విద్యార్థులు చేపట్టిన విద్యాబోధనను పరిశీలించి బహుమతులను ప్రదానం చేశారు.

మెదక్ జిల్లాలో

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 5: పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్ బాలికలున్నత పాఠశాలలతో పాటు, శ్రీసరస్వతీ శిశుమందిర్, ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. మండల విద్యాశాఖ నోడల్ అధికారి వెంకటేశం, ప్రధానోపాధ్యాయులు, శిశుమందిర్ పాఠశాల అధ్యక్షుడు గంగాధర్ పాల్గొన్నారు.


శ్రీ అక్షయ కళాశాల విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న స్టేట్ ఇంటలిజెన్స్ ఎస్పీ శిరీషరాఘవేంద్ర

●నర్సాపూర్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సాపూర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీలు పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు మల్లేశం, అంజిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

●అల్లాదుర్గం: అల్లాదుర్గంలోని జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

●చిన్నశంకరంపేట: చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. చందంపేట హైస్కూల్లో ఉపాధ్యాయులను మాజీ సర్పంచ్ శ్రీలతస్వామిరాజ్ ఘనంగా సన్మానించారు.

●చేగుంట: చేగుంట మండల వనరుల కార్యాలయం వద్ద సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి తపస్ జిల్లా అధ్యక్షుడు జిడ్డి ఎల్లం, ఉపాధ్యాయులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవానంద్, ప్రభాకర్, ఆంజనేయులు, గంగారావు పాల్గొన్నారు.

●వెల్దుర్తి: వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవానికి ఎంఈవో యాదగిరి హాజరై మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●చిలప్‌చెడ్: మండలం పరిధిలోని పలు పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు.

●మాసాయిపేట: మాసాయిపేట మండలంలోని చెట్ల తిమ్మాయపల్లి, మాసాయిపేట, బొమ్మారం, పోతనపల్లి, అచ్చంపేట గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాసాయిపేట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మపురి రంగారెడ్డి, హరిరంజన్‌శర్మ, చెట్లతిమ్మాయిపల్లి ఉపాధ్యాయులు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

గోమారంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

శివ్వంపేట, సెప్టెంబరు 5: గోమారంలో గుర్తు తెలియని మృతదేహం గురువారం లభ్యమైంది. మండల పరిధిలోని గోమారం గ్రామపంచాయతీకి వెళ్లే దారిలో రోడ్డు పక్కన వ్యక్తి(40) మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. మూడురోజులుగా మృతుడు గ్రామంలోని తిరిగినట్లు చెప్పారు. గ్రామ కార్యదర్శి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన కారు, ఇద్దరికి తీవ్రగాయాలు

హత్నూర, సెప్టెంబరు 5: ఆటోను కారు ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలైన సంఘటన హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామ శివారులో గురువారం సాయంత్రం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం సాలాజిపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ వేముల సాయిలు, రేగోడు మండలం ఇటికేపల్లి గ్రామానికి చెందిన బంధువులైన పొట్టి లక్ష్మి, పులబోయిన విత్తమ్మ, భవాని, వర్షితను పటాన్‌చెరు మండలం కిష్టారెడ్డిపేటకు ఆటోలో తీసుకుని వెళ్తున్నాడు. వడ్డేపల్లి గ్రామ శివారులోకి చేరుకోగానే పటాన్‌చెరు నుంచి నర్సాపూర్ వైపు వస్తున్న కారు ఒక్కసారిగా ఢీకొట్టింది. ఆటో బోల్తాపడడంతో డ్రైవర్ సాయిలు, పొట్టి లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఇంకా బాధితులు ఫిర్యాదు ఇవ్వలేదని పోలీసులు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం

- బైకిస్టును తప్పించబోయి రోడ్డు కిందికి దూసుకుపోయిన వైనం


రోడ్డు కిందికి దూసుకుపోయిన బస్సు

హత్నూర, సెప్టెంబరు 5: అదుపుతప్పి ఆర్టీసీ బస్సు రోడ్డు కిందికి దూసుకుపోయిన సంఘటన హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగింది. ఎస్ఐ సుభాష్ కథనం ప్రకారం.. దౌల్తాబాద్ నుంచి ఓవ్యక్తి బైక్‌పై వడ్డేపల్లి వెళ్తున్నాడు. నర్సాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు దౌల్తాబాద్ నుంచి ప్రయాణికులతో పటాన్‌చెరుకు బయలుదేరింది. వడ్డేపల్లి గ్రామ శివారులోకి చేరుకోగానే ముందుగా వెళ్తున్న బైకిస్టు అదుపు తప్పి కిందపడి పోయాడు. అప్రమతమైన బస్సు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్‌లు వేయడంతో అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకుపోయింది. ఈ సమయంలో బస్సులో సుమారు 35 మంది ప్రయాణికులు ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఏం జరిగిందో తెలియక ప్రయాణికులు తీవ్ర భయందోళనతో అరుపులు, కేకలు వేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుభాష్ వెంటనే అక్కడకు చేరుకుని పరిస్థితి పరిశీలించారు. ప్రయాణికుల్లో కొందరికి స్వల్ప గాయాలయ్యాయని తెలిసింది.

మున్సిపల్ కమిషనర్‌గా రామకృష్ణారావు బాధ్యతల స్వీకరణ

నర్సాపూర్, సెప్టెంబరు 5: నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా రామకృష్ణారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన జైతురాంనాయక్ అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి బదిలీ చేయగా.. ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ నుంచి రామకృష్ణారావు బదిలీ కాగా ఆయన గురువారం బాధ్యతలు తీసుకుని చైర్మన్ అశోక్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆశావర్కర్లపై సర్కార్ చిన్నచూపు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 5: ఆశావర్కర్లపై సర్కార్ చిన్నచూపు తగదని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆశావర్కర్లు మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా పనిచేస్తున్నా ప్రభుత్వం పారితోషికాల పేరుతో శ్రమదోపిడీకి గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక సేవందిస్తున్న తమను సర్కార్ చిన్నచూపు చూడడం అన్యాయమన్నారు. వెంటనే కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డా.శ్రీరాంకు వినతి పత్రాలు అందజేశారు.

భక్తితోనే మానవుడికి మోక్షం: సంగ్రాం మహరాజ్

నాగల్‌గిద్ద, సెప్టెంబరు 5: భక్తిమార్గంలో నడిస్తేనే మానవుడికి మోక్షం లభిస్తుందని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మేగ్యాతండాలో హోమం ముగింపునకు హాజరై భక్తులు పలు ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవిదాస్‌మహరాజ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిరప పంటను పరిశీలించిన అధికారులు


మిరపతోటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

గుమ్మడిదల, సెప్టెంబరు 5: అంతుచిక్కని తెగులతో చేతికొచ్చిన మిరపపంట నేలపాలై మురిగిపోయి రైతులు నష్టపోతున్నారని గతనెల 26న ఆంధ్రజ్యోతిలో 'మిరప పంటకు అంతుచిక్కని తెగులు' అనే కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కాగా గురువారం మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు గుమ్మడిదల గ్రామానికి చెందిన రైతు మోహన్‌రెడ్డితో కలిసి మిరప పంటను పరిశీలించారు. శాస్త్రవేత్తలను కలిసి సలహాలు తీసుకుని మందులు వాడి తెగులును అంతం చేసి పంటను కాపాడే ప్రయత్నం చేస్తామన్నారు.

'విధుల్లోంచి తొలగించొద్దు'

నారాయణఖేడ్, సెప్టెంబరు 5: సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పార్ట్‌టైంగా విధులు నిర్వహిస్తున్న తమను అకస్మాత్తుగా ప్రభుత్వం విధుల నుంచి తొలగించడంతో కుటుంబాలు వీధిన పడ్డాయని, అందువల్ల తమను విధుల్లోంచి తొలగించొద్దని కోరుతూ పలువురు కాంట్రాక్ట్ సిబ్బంది గురువారం నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో భవజ్ఞకు బంగారు పతకం


భవజ్ఞను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిలప్‌చెడ్, సెప్టెంబరు 5: మేడ్చల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో అండర్-12 స్పారింగ్ విభాగంలో మండల పరిధిలోని నవభారతి పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థిని భవజ్ఞ బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్‌గౌడ్ విద్యార్థిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, నిరంజన్, దైవి, సమ్రీన్, గంగవేణి, సరోజా, శిరీష, భవాని పాల్గొన్నారు.

దీప, దూప నైవేద్యానికి నోచని పురాతన విగ్రహాలు


పురాతన విగ్రహాలు

శివ్వంపేట, సెప్టెంబరు 5: గూడూర్ గ్రామంలో పురాతన విగ్రహాలు లభ్యమైనట్లు పురోహితులు రాజశేఖర్‌శర్మ గురువారం తెలిపారు. మండల పరిధిలోని పురాతన సోమేశ్వర ఆలయానికి వెళ్లే దారిలో పరిసర ప్రాంతాల్లో ముళ్లపొదలు శుభ్రం చేస్తుండగా.. ఎన్నోఏళ్ల నాటి పురాతన గణపతి, ఆంజనేయస్వామి, నంది విగ్రహాలు లభించాయని తెలిపారు. పురావస్తుశాఖ అధికారులు పరిశీలించి విగ్రహాలు ఏ కాలం నాటివో గుర్తించి దీప దూప నైవేద్యం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పాపన్నపేట ఎంపీడీవోగా విష్ణువర్ధన్

పాపన్నపేట, సెప్టెంబరు 5: పాపన్నపేట ఎంపీడీవోగా విష్ణువర్ధన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ఉన్న ఈయన పాపన్నపేట ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సిబ్బంది ఆయనను సన్మానించారు.

'ప్రభుత్వం చేప పిల్లల ఉచిత పంపిణీని చేపట్టాలి'

జిన్నారం, సెప్టెంబరు 5: చెరువు, కుంటల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని మండల మత్స్య సహకార సంఘం నాయకులు వెంకటేశం కోరారు. గురువారం జిన్నారంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉచితంగా మత్స్యకారులకు పంపిణీ చేసిన చేప పిల్లల పథకాన్ని ప్రభుత్వం కొనసాగించాలని ఆయన కోరారు.

పటాన్‌చెరులో క్లినిక్ సీజ్

సంగారెడ్డి అర్బన్: పటాన్‌చెరులో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ అనుమతి లేకుండా నడుపుతున్న ఇందిరా క్లినిక్‌తో పాటు పద్మావతి హాస్పిటల్‌ను సీజ్ చేశారు. అదేవిధంగా శ్రీగణేష్ డయాగ్నస్టిక్స్‌లో ధరల పట్టిక పెట్టకుండా అధిక రుసుము తీసుకుంటున్న కారణంగా సీజ్‌చేశారు.

నిందితుడిని శిక్షించాలి: బీజేపీ

మెదక్ అర్బన్: అసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండల పరిధిలో ఆదివాసి గిరిజన మహిళపై అత్యాచారం చేసేందుకు యత్నించిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో స్థానిక రాందాస్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు.

'అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి'

హత్నూర: హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల శివారులో గల ఎపిటోరియా పరిశ్రమలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులుటీఎస్ఐఐసీ చైర్మన్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

'బీఆర్ఎస్ నాయకుల విమర్శలు విడ్డూరం'

నర్సాపూర్: నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి పట్టించుకోవడం లేదని విమర్శించిన డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డిలపై బీఆర్ఎస్ నాయకులు అనవసరపు విమర్శలు చేయడం మానుకోవాలని పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశం, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ బ్లాక్ అధ్యక్షుడు రిజ్వాన్ అన్నారు.

బీఎల్‌వోలతో సమావేశం

జిన్నారం: బొల్లారం మున్సిపాలిటీలో నూతన ఓటరు నమోదు కోసం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ నిర్మల, ఆర్వో నర్సింహులు, మండల ఆర్ఐ జయప్రకాష్‌లు బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. నూతన ఓటరు నమోదు కోసం ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు.

పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పంతులు రాజు, సురేష్

పాపన్నపేట: పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా రాజు, ప్రధాన కార్యదర్శిగా దాసరి సురేష్ ఎన్నికయ్యారు. ప్రాథమికోన్నత పాఠశాల ఎల్లాపూర్‌లో ఏర్పాటుచేసిన పీఆర్టీయూ మండల సమావేశంలో వీరు ఎంపికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్, ఫసియోద్దీన్, ఉపాధ్యక్షులుగా బాల అనపోతారెడ్డి, ఉపాధ్యక్షురాలిగా సంపత్‌కుమారి, మహిళా కార్యదర్శిగా శ్యామల, కార్యదర్శిగా నాగేశ్వర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

- ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్, సెప్టెంబరు 5: వినాయక చవితి, మిలాదున్‌నబీ పండుగలు ఒకేసారి రావడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వివిధశాఖలకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించి ఎమ్మెల్యే మాట్లాడారు. మున్సిపల్, పోలీస్, ఆర్అండ్‌బీ, అగ్నిమాపక, వైద్య, విద్యుత్‌శాఖలకు చెందిన అధికారులు తమ బాధ్యతలను సక్రంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రాజు, డీఎస్పీ రామ్మోహనరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అధికారుల సమీక్ష అనంతరం ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి తదితరులు ప్రజలకు, నాయకులకు, అభిమానులకు వినాయకుల మట్టి ప్రతిమలను అందజేశారు. ఇదిలా ఉండగ పట్టణంలోని దత్తగిరి కాలనీలో సాయిబాబ ఆలయం వద్ద బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ జైపాల్‌రెడ్డి పలువురికి మట్టి వినాయకులను అందజేశారు. అలాగే జహీరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాల్లో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, వివిధశాఖలకు చెందిన అధికారులు పర్యటించారు. అలాగే డౌన్‌టౌన్ సమీపంలోని అల్గోల్ చౌరస్తా వద్ద అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పనులను పరిశీలించారు.

ఎల్‌వోసీ ఉత్తర్వులను అందజేసి ఎమ్మెల్యే

నారాయణఖేడ్, సెప్టెంబరు 5: పెద్దశంకరంపేట మండలం గోపనివెంకటాపూర్‌కు చెందిన దమ్మురాములు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా, చికిత్సల కోసం సీఎం సహాయ నిధి ద్వారా రూ.3 లక్షలు మంజూరుకు సంబంధించి ఎల్‌వోసీ ఉత్తర్వులు మంజూరయ్యాయి. ఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహంలో బాధితుడి కుటుంబీకులకు ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్‌చౌహాన్, విఠల్‌రెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం


కలెక్టర్ వల్లూరు క్రాంతికి మట్టి వినాయకుడి ప్రతిమను అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అధ్యక్షుడు రాహుల్

సంగారెడ్డి రూరల్/సంగారెడ్డి క్రైం/జహీరాబాద్, సెప్టెంబరు 5: మట్టి వినాయకులు పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అధ్యక్షుడు రాహుల్ అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతికి గురువారం మట్టి వినాయకుడి ప్రతిమను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు రాహుల్, సభ్యులు ఉమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు. అలాగే హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో సంగారెడ్డి డీఎస్పీ పి.సత్తయ్యగౌడ్‌కు గురువారం మట్టి వినాయక విగ్రహాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ యూత్ నాయకులు అఖిల్, శివకుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం: బ్రహ్మాజీ


గడిపెద్దాపూర్‌లో నిర్వహించిన పోషన్ అభియాన్ పోషణమాసంలో మాట్లాడుతున్న బ్రహ్మాజీ

అల్లాదుర్గం/తూప్రాన్/కొండాపూర్// సెప్టెంబరు 5: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మెదక్ జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ అన్నారు. పోషన్ అభియాన్ పోషణమాసం కార్యక్రమంలో భాగంగా బుధవారం అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. గర్భవతి అయిన వెంటనే స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో వారి పేరును నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మలత, సూపర్‌వైజర్ నాగమణి, పోషణ అభియాన్ జిల్లా సమన్వయకర్త వెంకట్, కార్యదర్శి రాములు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. తూప్రాన్ మండలంలోని ఘనపూర్ కేంద్రం-2, ఇస్లాంపూర్ కేంద్రం-2లలో పోషణ మాసోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తూప్రాన్ ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ శివకుమారి, ఘనపూర్ సెక్టార్ సూపర్‌వైజర్ సునీతాదేవి హాజరై మాట్లాడారు. కొండాపూర్ మండల పరిధిలోని గొల్లపల్లి, చెర్లగోపులారం అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మహిళలకు పౌష్టికాహారంపై సూపర్‌వైజర్ శ్యామల, అంగన్‌వాడీ టీచర్లు అనసూయ, అరుణ, శ్యామల అవగాహన కల్పించారు.

మెదక్‌ను చార్మినార్ జోన్‌లోకి మార్చండి

- టీచర్ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డికి ట్రెసా, ఉపాధ్యాయ సంఘాల వినతి

మెదక్ అర్బన్, సెప్టెంబరు 5: మెదక్ జిల్లాను రాజన్న సిరిసిల్ల జోన్ నుంచి చార్మినార్ జోన్‌లోకి మార్చాలని గురువారం టీచర్ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డికి ట్రెసా, ఉపాధ్యాయ సంఘాల నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు, శ్రీనివాస్ మాట్లాడుతూ.. మెదక్‌ను రాజన్న జోన్‌లో చేర్చడంతో విద్యార్థుల స్థానికత, స్థానికేతర సమస్యలతో ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని ఆయనకు వివరించారు. మెదక్‌ను చార్మినార్ జోన్‌కు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రోడ్డు పనులు పూర్తయితే ప్రమాదాలకు చెక్


ఖేడ్- మనూర్ మధ్య కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులు

నారాయణఖేడ్, సెప్టెంబరు 5: అనేక మలుపులతో ప్రమాదకరంగా ఉన్న నిజాంపేట్- నారాయణఖేడ్- బీదర్ జాతీయ రహదారి పనులు పూర్తయితే ప్రమాదాలకు చెక్ పడనున్నదని వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిజాంపేట- నారాయణఖేడ్- మనూరు- పుల్‌కూర్తి- న్యాల్‌కల్‌ల మీదుగా బీదర్ వరకు 46 కిలోమీటర్ల రహదారి పనుల కోసం ప్రభుత్వం రూ.518 కోట్లు మంజూరు చేసింది. భూసేకరణ, ఇతర సర్వే పనులు పూర్తయిన అనంతరం టెండర్లను ఖరారు చేయడంతో విస్తరణ పనులు ప్రారంభించారు. న్యాల్‌కల్ వైపు నుంచి నారాయణఖేడ్ వైపు రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. నారాయణఖేడ్ - నిజాంపేట మధ్య 14 కిలోమీటర్ల దూరంలో 14 మూల మలుపులు ప్రమాదకరంగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతుండేవి. ఈ పనులు పూర్తయితే ప్రమాదాలు జరగవని వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థకు చేరిన భవనం కూల్చివేత

జిన్నారం, సెప్టెంబరు 5: బొల్లారం మున్సిపాలిటీలో శిథిలావస్థకు చేరిన భవనాన్ని మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. గురువారం లక్ష్మీనగర్‌లో ప్రమాదకరంగా మారిన శిథిల భవనాన్ని మున్సిపల్ టౌన్ ప్లానింగ్, శానిటరీ, ఇతర అధికారులు ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. రెండురోజుల క్రితం నోటీసులు ఇచ్చిన అధికారులు అందులో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించి, భవనాన్ని కూల్చివేశారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకుందాం: డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్

సంగారెడ్డి క్రైం/తూప్రాన్/జిన్నారం/ఝరాసంగం/కౌడిపల్లి/గుమ్మడిదల/చిన్నశంకరంపేట, సెప్టెంబరు 5: వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలను హిందూ, ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ కోరారు. సంగారెడ్డి పట్టణంలోని వైఎంఆర్ గార్డెన్‌లో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ ఎస్.భాస్కర్ పాల్గొన్నారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుశాఖ అనుమతి తీసుకోవాలని తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి పేర్కొన్నారు. తూప్రాన్‌లో ఎస్ఐ శివానందం అధ్యక్షతన వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులు, పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, ఎంపీడీవో శేషాద్రి, సీఐ రంగకృష్ణ పాల్గొన్నారు. అల్లాదుర్గం మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ గంగాధర్ వినాయక ఉత్సవ నిర్వాహకులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రమైన ఝరాసంగంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు, ఎస్ఐ నరేష్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మండపాల నిర్వాహకులతో కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి సమావేశం నిర్వహించి మాట్లాడారు. గుమ్మడిదల మండల కేంద్రంలోని రైతువేదికలో జిన్నారం సీఐ సుధీర్‌కుమార్ శాంతి సమావేశం నిర్వహించారు. చిన్నశంకరంపేట మండలంలోని పలు గ్రామాల రాజకీయ నాయకులు, యువతతో ఎస్ నారాయణ పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు.

అలుగుపారిన పెద్ద చెరువు


అలుగుపారుతున్న పెద్ద చెరువు

తూప్రాన్, సెప్టెంబరు 5: జిల్లాలోనే పెద్ద చెరువుల్లో ఒకటైన తూప్రాన్ పెద్ద చెరువులోకి నీరు చేరడంతో గురువారం ఉదయం అలుగుపారింది. 750 ఎకరాల ఆయకట్టు కలిగిన పెద్దచెరువు నింపేందుకు హల్దీవాగు నుంచి లిఫ్టు ఇరిగేషన్ నుంచి పంపింగ్ చేపట్టారు. భారీగా వర్షాలు కురుస్తుండటంతో పంపింగ్ నిలిపివేశారు. పెద్దచెరువు నిండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.